క్లుప్తంగా

ఆకట్టుకున్న సంగీత కచేరి



నల్లకుంట: శ్రీరామగాన సభ ఆధ్వర్యంలో వాగ్గేయకార ఆరాధన సంగీతోత్సవాలు సంగీత ప్రియులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. శనివారం సాయంత్రం ప్రముఖ సంగీత విద్వాంసురాలు మంగళంపల్లి స్వర్ణ, భమిడిపాటి లలిత నిర్వహించిన గాత్ర కచేరి ఆలరించింది. కార్యక్రమంలో గానసభ అధ్యక్షుడు జి.నాగరాజన్, ఉపాధ్యక్షులు కేవీ. తిరుమల రావు పాల్గొన్నారు.

దోమల నివారణకు విస్తృత కార్యక్రమాలు



మాట్లాడుతున్న కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్

కాచిగూడ: జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ జోనల్ పరిధిలోని పలు కళాశాలలు, పాఠశాలల్లో దోమల నిర్మూలన కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి శనివారం మున్సిపల్ అధికారులు విస్తృత కార్యక్రమాలను నిర్వహించారు. జీహెచ్ఎంసీ ఏఎంఓహెచ్ డాక్టర్ హేమలత నేతృత్వంలో బర్కత్‌పురలోని రెడ్డి మహిళా కళాశాలలో అవగాహన తరగతులను నిర్వహించారు. అనంతరం విద్యార్థులు ప్రజలను చైతన్యం చేసేందుకు ర్యాలీ నిర్వహించారు.

దేశంలోనే అత్యధిక పరిహారం ఇచ్చాం

చిక్కడపల్లి: కార్మికుల నష్టపరిహార చట్టం 1923 ప్రకారం ఎన్టీపీసీ కార్మికుడు చాట్రగడ్డ ప్రభాకర్‌రావు కుటుంబానికి దేశంలోనే అత్యధిక నష్టపరిహారాన్ని కార్మికశాఖ అందించిందని ఆశాఖ ఉప కమిషనర్ -1(డీసీఎల్) బి.జాసన్ తెలిపారు. శనివారం సాయంత్రం ఆయన ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 2024లో రూ.47, 66,100 బాధిత కుటుంబానికి అందజేయాలని, 12శాతం వడ్డీతో 2010 నుంచి పరిహారం చెల్లించాలని ఎన్టీపీసీకి అర్డర్ ఇచ్చామన్నారు. దీంతో రూ.1,34,78,269 మొత్తాన్ని మృతుడి భార్య రేవతికి అందజేశామన్నారు. ఇంత పెద్ద మొత్తంలో పరిహారం అందించడం దేశంలోనే తొలిసారి అని ఈ ఘనత రాష్ట్ర కార్మిక శాఖకు దక్కిందన్నారు.

ఘనంగా స్టాటిస్టిక్స్ డే

లక్డీకాపూల్: ప్రతి సబ్జెక్టు లో స్టాటిస్టిక్స్ పాత్ర ఉందని కేశవ్ మెమోరియల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ కామర్స్ అండ్ సైన్సెస్ ప్రెసిడెంట్ జస్టిస్ నరసింహా రెడ్డి అన్నారు. నారాయణగూడలోని కేశవ్ ఇనిస్టిట్యూట్‌లో శనివారం స్టాటిస్టిక్స్ డే ఘనంగా జరిగింది. పిల్లలు స్టాటిస్టిక్స్‌ను రీసెర్చ్ విభాగాలలో ఎంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చాలా స్టాటిస్టిక్స్ గేమ్స్ ను ఆడించారు. ఈ కార్యక్రమానికి 90 వరకు స్టాటిస్టికల్ మోడల్స్ ను తయారు చేసి ప్రదర్శించారు.

బీసీలను మోసం చేసే కుట్ర జరుగుతోంది

కాచిగూడ: బీసీలతో రాష్ట్రం లోని కాంగ్రెస్ ప్రభుత్వం చదరంగం ఆడుతోందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం అన్నారు. బీసీలకు న్యాయ పరంగా రావాల్సిన రిజర్వేషన్లు రాకుండా మోసం చేయడానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు.స్థానిక సంస్థల్లో 42శాతం బీసీ రిజర్వేషన్లు, విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు బిల్లును రాష్ట్రపతికి పంపించి రాష్ట్ర ప్రభుత్వం చేతులు దులుకుందని, ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సిన ప్రభుత్వం ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వాన్ని సంప్రదించలేదని ఆయన పేర్కొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: జులై 3, 4 తేదీలలో నిర్వహించతలపెట్టిన 48 గంటల బంద్ విజయవంతం కోసం జార్జిరెడ్డి పీడీఎస్‌యూ నాయకులు వినూత్న కార్యక్రమంలో చేపట్టారు. శనివారం నగరంలో పర్యటించి ప్రచారం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిల విడుదల, విద్యా రంగ సమస్యలను పరిష్కరించాలని చేపట్టిన 48 గంటల బంద్‌కు ప్రవేటు కాలేజీల యజమానులు సైతం మద్దతు ప్రకటించిన్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జార్జిరెడ్డి పీడీఎస్‌యూ ఓయూ అధ్యక్షులు కె.స్వాతి, ప్రధాన కార్యదర్శి రుక్మత్ పాషా, ఉపాధ్యక్షులు సతీష్, నాయకులు బాలకృష్ణ, భగత్, ప్రమోద్, విజయ్, తరుణ్ పాల్గొన్నారు.

అధ్వాన రోడ్లతో అవస్థలు

పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

చిక్కడపల్లి: ముషీరాబాద్ నియోజవర్గం గాంధీనగర్ డివిజన్‌లోని రోడ్లన్నీ గుంతలు పడి కంకర తేలి అధ్వాన్నంగా తయారయ్యాయి. ఈ రోడ్లపై వెళ్లడానికి వాహనాదారులు, స్థానిక ప్రజలు జంకుతున్నారు. గుంతలకు తోడు రోడ్లపై ప్రవహించే నీరు వాహనచోదకులను ఇబ్బంది పెడుతోంది. ఇండ్లలోని నీరు కూడా బయటకు వదలడం వల్ల ఈ సమస్య నెలకొంటోంది. చిక్కడపల్లి, వివేక్‌నగర్, త్యాగరాయ గానసభ, అశోక్‌నగర్, గాంధీనగర్, అశోక్‌నగర్, వివేక్‌నగర్ హనుమాన్ దేవాలయం బ్యాంక్ ఆఫ్ బరోడా, లేబర్ కార్యాలయం రోడ్డులేన్, అశోక్‌నగర్ కాస్ట్‌కాస్ట్ , ఆర్టీసీ క్రాస్‌రోడ్డు, అరుంధతినగర్, సబర్మతినగర్, వాల్మికినగర్, ఇలా అనేక ప్రాంతాలలో రోడ్లన్ని గుంతలుపడి కంకర తేలి అధ్వాన్నంగా మారాయి. వివేక్‌నగర్ పీపుల్స్ పార్క్ మార్గంలో 15 ఏళ్లుగా రోడ్లు వేయలేదని దీనివల్ల ఆ రోడ్డు గుంతలమయమైన ఎవ్వరూ పట్టించుకోవడంలేదని స్థానికులు వాపోతున్నారు.



చిక్కడపల్లి మెయిన్‌రోడ్డు యూనియన్ బ్యాంక్ వద్ద..



గాంధీనగర్ కెనార బ్యాంక్ పార్క్ వద్ద..



అశోక్‌నగర్‌లో..



చిక్కడపల్లి హనుమాన్ దేవాలయం వద్ద..



అశోక్‌నగర్ చౌరస్తా నుండి కాస్ట్‌కాస్ట్ వేళ్లే రోడ్డులో..

దివ్యాంగుల సంక్షేమాన్ని విస్మరిస్తున్న కేంద్ర ప్రభుత్వం



సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మురళీ ధరన్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దివ్యాంగుల సంక్షేమాన్ని కేంద్ర ప్రభుత్వం విస్మరిస్తోందని ఎన్‌పీఆర్‌డి జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీ ధరన్ అన్నారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 11 ఏండ్ల బీజేపీ పాలన వికలాంగులపై ప్రభావం అనే అంశంపై సెమినార్ జరిగింది. ఈ సందర్భంగా మురళీధరన్ మాట్లాడుతూ...2014 ఎన్నికల కంటే ముందు వికలాంగుల సంక్షేమానికి కృషి చేస్తామని హామీ ఇచ్చిన మోదీ ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. 11 ఏండ్లలో వికలాంగులలో పేదరికం, నిరుద్యోగం , ఆకలి చావులు పెరిగిపోయాయి అన్నారు. కార్యక్రమంలో ఎన్పిఆర్‌డి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. అడివయ్య, కోశాధికారి ఆర్. వెంకటేష్, జె.రాజు,యశోధ, కాసప్ప, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలను ఆదుకునేందుకు ముందుకు రావాలి



డాక్టర్ రాజ్యలక్ష్మికి కుర్చీలు, కార్పెట్లు అందజేస్తున్న లయన్స్ క్లబ్ నిర్వాహకులు

కవాడిగూడ: నిరుపేద ప్రజలు వైద్యం చేయించుకునే ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రత్యేక సౌకర్యాలు కల్పించడానికి ప్రభుత్వంతోపాటు పలు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ 320 హెచ్ గవర్నర్ లయన్ మనోహర్‌రెడ్డి సూచించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ ప్యారడైజ్ ఆధ్వర్యంలో శనివారం కవాడిగూడ డివిజన్‌లోని దోమలగూడ గగన్ మహల్‌లో ఉన్న హెల్త్ సెంటర్‌లో లయన్ అడ్డగాట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆసుపత్రికి అవసరమైన 40 కుర్చీలు, రెండు కార్పెట్లను ఆసుపత్రి డాక్టర్ రాజ్యలక్ష్మికి ఉచితంగా అందజేశారు. జోన్ చైర్‌పర్సన్ లయన్ సుబ్రమణ్యం, అధ్యక్షుడు లయన్ శేరుపల్లి గణేష్, కార్యదర్శి లయన్ చంద్రమోహన్ నర్సపల్లి , ప్రాజెక్ట్ చైర్మన్ లయన్ హేమంత్ పాపాని పాల్గొన్నారు.

పీవీకి ఘన నివాళి

ముషీరాబాద్: భారతరత్న, మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు 104వ జయంతి కార్యక్రమాలు శనివారం ఘనంగా జరిగాయి. అడిక్‌మెట్ బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ బ్రాహ్మణ సంఘాల నాయకులు, వివిధ పార్టీల కార్యకర్తలు పాల్గొన్నారు.



బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో పి.వి.నర్సింహ్మారావు చిత్రపటానికి నివాళులు

ఇళ్ల విషయంపై ఆందోళన వద్దు

- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ డివిజన్ రామస్వామి కంపౌండ్, బర్కల్‌బస్తీ ప్రజలు ఇండ్ల విషయంలో ఎలాంటి భయాందోళనకు గురికావద్దని మీకు అన్ని విధాలా నేను అండగా ఉంటానని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ స్థానికులకు భరోసా ఇచ్చారు. శనివారం రామస్వామి కంపౌండ్, బర్కల్‌బస్తీలను సందర్శించారు. ఇండ్ల విషయంలో రెవెన్యూ అధికారులు వచ్చి సర్వే చేయడంతో స్థానికులు ఆందోళనకు గురై ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను తమ ఆవేదనను వెలిబుచ్చారు. దీంతో శనివారం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులతో కలిసి ఇరు బస్తీలను సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ ఎండ్ల తరబడి నుంచి ఇక్కడే స్థిరనివాసం ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్న మిమ్మల్నీ ఎవరూ ఖాళీ చేయించలేరని ధైర్యంగా ఉండాలన్నారు. మీ ఇండ్లకు తాను అన్ని విధాలా అండగా ఉంటూ కాపాడుకుంటానన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కె. హేమలత, ముషీరాబాద్ తహసీల్దార్ రాణాప్రతాప్‌సింగ్, జలమండలి డీజీఎం ఆశీష్, డివిజన్ అధ్యక్షులు వెంకటేషన్‌రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

చెట్ల కొమ్మల తొలగింపు



చెట్ల కొమ్మలను తొలగింపు పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ పద్మా వెంకట్‌రెడ్డి

అంబర్‌పేట: డివిజన్‌లో చెట్ల కొమ్మలు, వీధిలైట్ల సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటునట్లు బాగ్‌అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ బీ.పద్మావెంకట్‌రెడ్డి తెలిపారు. శనివారం డివిజన్‌లో పలు ప్రాంతాల్లో ప్రమాదకరంగా మారిన చెట్ల కొమ్మలను తొలగించారు. అలాగే వెలుగని వీధిలైట్లకు మరమ్మత్తులు చేయించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ మౌలిక సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు కృషి చేస్తున్నట్లు చెప్పారు.

'బ్రూసెల్లోసిస్' వ్యాధిని అరికట్టాలి

కాచిగూడ: గొర్రెలలో సోకిన 'బ్రూసెల్లోసిస్' వ్యాధిని అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సమాజ్‌వాది పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎస్.సింహాద్రి అన్నారు. ఈ వ్యాధి కారణంగా గొర్రెల మరణాలు పెరిగిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో దాదాపు 12 లక్షల కుటుంబాలు గొర్రెల, మేకల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్నారని, గొర్రెల్లో వచ్చిన ఈ వ్యాధితో వారు తీవ్ర ఆర్థిక నష్టాలను ఎదుర్కొంటున్నారని ఆయన తెలిపారు.

వీధి దీపాల ఏర్పాటుకు కృషి



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్

చిక్కడపల్లి: డివిజన్‌లో వీధి దీపాలను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామని కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ అన్నారు. శనివారం ఆమె వీధిదీపాల స్తంబాల నిర్మాణ పనులను పరిశీలించి మాట్లాడారు. జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశంలో డివిజన్‌లో వీధిదీపాలకు మరమ్మత్తులు చేపట్టాలని అవసమైన ప్రాంతాల్లో నూతన వీధి దీపాలను ఏర్పాటు చేయాలని కోరామన్నారు, దీంతో డివిజన్‌లో నాలుగు నూతన ఐమాక్స్ లైట్లు 10 నూతన విధిదీపాల స్తంబాల ఏర్పాటు చేస్తున్నామన్నారు. బీజేపీ సీనియర్ నేత వినయ్‌కుమార్, నాయకులు నవీన్‌కుమార్, రత్నసాయిచంద్ పాల్గొన్నారు,

మారుతి గుప్తాకు ఒకేషనల్ ఎక్సలెన్సీ అవార్డు



మారుతి గుప్తాకు అవార్డు అందజేస్తున్న రోటరాక్ట్ ఆర్గనైజేషన్ డిఆర్ఆర్ వినీల

కాచిగూడ: రోటరాక్ట్ ఆర్గనైజేషన్ రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 3150 ఆధ్వర్యంలో 2024-25 సంవత్సరానికి గాను రోటరాక్ట్ డిస్ట్రిక్ట్ అవార్డ్స్ వేడుక శనివారం ఘనంగా జరిగింది. కంప్యూటర్ శిక్షణ రంగంలో విశేష ప్రతిభను కనబరిచిన మారుతి టెక్నాలజీస్ ఎండీ మారుతి గుప్తాకు ఒకేషనల్ ఎక్సలెన్సీ అవార్డును రోటరాక్ట్ ఆర్గనైజేషన్ డిఆర్ఆర్ వినీల అందజేశారు. సామాజిక సేవలో ఎల్లప్పుడు ముందుండే రోటరాక్ట్ సంస్థ ద్వారా అవార్డు అందుకోవడం ఆనందంగా ఉందని అన్నారు.

'ప్రవాహ' లఘు చిత్రానికి మొదటి బహుమతి



సీఎం చేతుల మీదుగా అవార్డును అందుకుంటున్న బద్రుకా కళాశాల విద్యార్థిని త్రియాంబిక

కాచిగూడ: మాదక ద్రవ్యాల వ్యతిరేక దినం సందర్భంగా డ్రగ్స్ నిర్మూలనపై నిర్వహించిన లఘుచిత్రాల పోటీల్లో కాచిగూడ లోని బద్రుకా కాలేజ్ కామర్స్ అండ్ ఆర్ట్స్ థియేట్రిక్స్ క్లబ్ విద్యార్థులు రూపొందించిన 'ప్రవాహ' లఘు చిత్రానికి రాష్ట్ర స్థాయి పోటీలో మొదటి బహుమతి లభించింది. బద్రుకా కళాశాల బికాం విద్యార్థిని త్రియాంబిక, విద్యార్థి బృంద సభ్యులను, డైరెక్టర్, ఎడిటర్, నటుడిని సీఎం రేవంత్ రెడ్డి సత్కరించి అభినందించారు. రూ.50వేల నగదుతో పాటు ప్రశంసా పత్రాన్ని అవార్డును సీఎం వారికి అందజేశారు.

విద్యార్థులను ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: విద్యార్థులను ప్రోత్సహిస్తే అద్భుతాలను సృష్టిస్తారని డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి అన్నారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సెమ్స్ ఒలంపియడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సైన్స్ , సోషల్, గణితం పోటీలలో నిలిచిన విజేతలకు సెమ్స్ నేషనల్ అవార్డును ప్రధానం చేశారు. ఈ సందర్భంగా శ్రీలత శోభన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో పోటీతత్వం వారిలో ప్రతిభను వెలుగులోకి తెస్తుంది అన్నారు. సంస్థ అధ్యక్షులు రాఘవులు, ఏపీ రామచంద్ర రెడ్డి, సెమ్స్ డైరెక్టర్ జయప్రసాద్ పాల్గొన్నారు.



విద్యార్థులకు అవార్డులను ప్రదానం చేస్తున్న సంస్థ ప్రతినిధులు

పుస్తకం రచించిన 11 ఏళ్ల చిన్నారి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: 11 ఏళ్ల చిన్నారి సింహాద్రి ఆయుషి రచించిన ఫైనీ ఏ ట్రూ ఆంగ్ల నవలతోపాటు చిన్నారి అమ్మ సింహాద్రి నాగశిరిష రచించిన అమ్మ మాట, విరజల్లు, టింకూ..ద చిట్టెలుక పుస్తకాలను శనివారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆయుషి పబ్లికేషన్స్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత చొక్కాపు వెంకటరమణ మాట్లాడుతూ... అతి చిన్న వయస్సులో ఇంత మంచి పుస్తకం రాయడం అభినందనీయం అని చిన్నారి ఆయుషి ప్రతిభకు ఇదోక నిదర్శనం అన్నారు.



సీసీ రోడ్డు పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే



కార్ఖానలో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

రసూల్‌పురా: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపిస్తూ నిధులు విడుదల చేస్తుండడంతో కంటోన్మెంట్ నియోజకవర్గంలో అభివృద్ధి శరవేగంగా జరుగుతోందని ఎమ్మెల్యే శ్రీగణేష్ పేర్కొన్నారు. కార్ఖానా బడీ మసీదు సమీపంలో నియోజకవర్గ ప్రత్యేక అభివృద్ధి నిధులు 56 లక్షల రూపాయలతో చేపట్టే సీసీ రోడ్డు పనులను శనివారం బోర్డు నామినేటేడ్ సభ్యురాలు భానుక నర్మదతో కలసి ఎమ్మెల్యే ప్రారంభించారు. నిధులు సకాలంలో విడుదల అవుతున్నందున ప్రజలకు అసౌకర్యం కలగకుండా పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు టీపీసీసీ కార్యదర్శి రాజేష్ యాదవ్, వివేక్ చింటూ పాల్గొన్నారు.

సీఎం సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలి

సనత్‌నగర్: వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు ముఖ్యమంత్రి సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సూచించారు. శనివారం వెస్ట్‌మారేడుపల్లిలోని ఆయన నివాసంలో సనత్‌నగర్ ఎస్ఆర్‌టీకి చెందిన ప్రసాద్ గుప్తాకు రూ.1.10లక్షలు, జిలానీబేగంకు లక్ష రూపాయల చొప్పును మంజూరైన ఆర్థిక సహాయం పత్రాలను (ఎల్‌వోసీ) ఆయన అందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కొలన్ బాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

హామీలు నెరవేర్చకుంటే ఉద్యమం తీవ్రతరం

- తెలంగాణ ఉద్యమకారుల హెచ్చరిక

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ ఉద్యమకారులకు గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని తెలంగాణ ఉద్యమకారులు హెచ్చరించారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ఉద్యమ సంఘాల సమన్వయ వేదిక ఆధ్వర్యంలో సమావేశం జరిగింది . ఈ కార్యక్రమంలో హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, గొల్లపల్లి దయానంద్,బాల కిషన్‌రావు, రాందాస్, అన్వర్ పటేల్, రంగారెడ్డి తదితరులు పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న తెలంగాణలో ఉద్యమకారులను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. తెలంగాణ ఉద్యమకారులకు సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేసి వారికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఉద్యమంలో పనిచేసిన కళాకారులకు సాంస్కృతిక సారధిలో అవకాశాలు కల్పించాలని, ఉచిత బస్సు పాస్‌తోపాటు 250 గజాల ఇంటి స్థలం కేటాయించాలని , ఉద్యమకారులకు 30 వేల రూపాయల గౌరవ వేతనాన్ని ప్రతి నెలా ఇవ్వాలని, ఆరోగ్యబీమా కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు ప్రఫుల్ రామిరెడ్డి, సుల్తాన్ యాదగిరి, మోహన్ బైరాగి, చంద్రన్న, ప్రసాద్, కుమారస్వామి, తుల్జారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఉద్యమకారుల సమావేశంలో అభివాదం చేస్తున్న జస్టిస్ చంద్రకుమార్ తదితరులు